ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
బుధవారం 9 జూలై 2025



# రేణుకా ఎల్లమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు





యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజక వర్గం కాచారం (కైలాసపురం)శ్రీ రేణుకా ఎల్లమ్మ ఆలయ ప్రాంగణంలో ఆషాడమాసం రెండవ మంగళవారం పురస్కరించుకొని ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ వంగపల్లి అంజయ్య స్వామి విజయలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు . ముఖ్యఅతిథిలుగా ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పబ్బా చంద్రశేఖర్ గుప్తా మరియు అడిషనల్ జనరల్ సెక్రెటరీ కటకం శ్రీనివాస్ గుప్తాలు హాజరైన పూజా కార్యక్రమాల్లో బాన్సువాడ పట్టన కేంద్రానికి చెందిన శ్రీ జోడ హనుమాన్ దేవాలయం చైర్మన్ నాగులూరి శ్రీనివాస్ గుప్తా దంపతులు అమ్మవారికి చీర సారి వడి బియ్యం సమర్పించారు . పూజ కార్యక్రమాలకు హాజరైన భక్తులకు హైదరాబాద్ ఉప్పల్ శ్రీ అభయ ఆంజనేయ స్వామి దేవాలయం చైర్మన్ నాగులూరి సుజాత అశోక్ దంపతుల ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిమాన్వితమైన శ్రీ కాచారం రేణుక ఎల్లమ్మ తల్లిని ఆషాడ మాసంలో దర్శించుకోవడం ఎంతో ఆనందంగా ఉందని అమ్మ దయ ఉంటే అన్నీ ఉన్నట్లే అని గత మూడు దశాబ్దాలుగా అమ్మవారి సేవలో నిమగ్నమైన ఆలయ వ్యవస్థాపకులు ధార్మికవేత్త డాక్టర్ వంగపల్లి అంజయ్య స్వామి గారికి అభినందనలు తెలిపారు. కార్యక్రమానంతరం ఐ వి ఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త స్వప్న దంపతుల సూచన మేరకు ఆషాడమాసం సందర్భంగా గోరింటాకు పండుగ జరుపుకొని మహిళలు సందడి చేశారు

కార్యక్రమంలో కాకినాడ వాస్తవ్యులు సినీ యాక్టర్ కటకం సందీప్ కుమార్ దంపతులు ఈసీఐఎల్ రేణికుంట శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయ ధర్మకర్త హైదరాబాదుకు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త వై నరేందర్ రెడ్డి సరిత దంపతులు మరియు ఈసీఐఎల్ కు చెందిన వేముల ప్రభాకర్ గౌడ్ – పుష్పలత, ధర్మేంద్ర చారి – స్వప్న దంపతులు, కొంపల్లి కిడ్స్ వరల్డ్ స్కూల్ ప్రిన్సిపల్ శ్రీవాణి , ఉప్పల ప్రవీణ్ కళ్యాణి దంపతులు, దుప్పల దేషారెడ్డి రజిత దంపతులు , సాఫ్ట్వేర్ ఇంజనీర్ అల్వాలకి చెందిన వనమా హర్ష మరియు వనమా లహరి మార్కండేయ కమిటీ సభ్యులు పార్వతీ సోమరాజులు, మరియు రఘునాథ పుర వాస్తవ్యులు బెజ్జాల విశ్వనాథం గుప్తా, చంద్రశేఖర్, గిరిపల్లి వాస్తవ్యులు పడకంటి శ్రీనివాస్ గుప్తా, కుమారుడు ప్రేమ్ కుమార్ , రాజా మార్కండేయ సినిమా మేనేజర్ కాసం రాము దంపతులు, । సినీ నిర్మాత సామా శ్రీధర్ ప్రశాంతి దంపతులు తదితరులు పాల్గొన్నారు.

# శాశ్వత నిత్యాన్నప్రసాద వితరణకు ఈవో రూ.1 లక్ష విరాళం



యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహింపబడుతున్న శాశ్వత నిత్యాన్నప్రసాద వితరణకు ఆలయ ఈవో వెంకటరావు తన నెల జీతం నుండి మంగళవారం రూ.1 లక్ష విరాళంగా ఇచ్చారు. గత నెల శాశ్వత నిత్యాన్నప్రసాద వితరణకు రూ.3 లక్షలు విరాళం ఇచ్చిన ఈవో.. తాను పదవీ విరమణ పొందే వరకు నెల జీతంలో రూ.1 లక్ష విరాళంగా ఇస్తానని ప్రకటించారు. ఇచ్చిన మాట మేరకు జూన్ శాలరీ నుండి మంగళవారం రూ.1 లక్ష విరాళంగా అందజేసి మాట నిలుపుకున్నారు. ఈ విరాళాన్ని ప్రతి ఆదివారం నుండి శుక్రవారం వరకు భక్తులకు ఉచిత పులిహోర ప్రసాదం పంపిణీ, ప్రతి శనివారం ఉచిత లడ్డూప్రసాదం పంపిణీ చేయడానికి వినియోగించాలనే ఈవో విజ్ఞప్తి మేరకు.. ఆలయ అధికారులు ఉచిత పులిహోర, లడ్డూప్రసాదం పంపిణీకి ఈవో విరాళ నిధులను ఖర్చు చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో వెంకటరావు మాట్లాడుతూ.. దాతలు తమకు నచ్చిన రోజులలో, నచ్చిన తిథిలలో భక్తులకు ఉచిత పులిహోర, లడ్డూప్రసాదం పంపిణీకి తోచిన విధంగా విరాళం ఇచ్చి స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆకాంక్షించారు.

# భద్రాచలం ఈవోపై దాడిని నిరసిస్తూ యాదగిరిగుట్ట ఉద్యోగుల ఆందోళన



యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: భద్రాచలం ఆలయానికి సంబంధించి భూముల పరిరక్షణ కోసం క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లిన ఈవో రమాదేవిపై కబ్జాదారులు చేసిన దాడిని నిరసిస్తూ.. యాదగిరిగుట్టలో శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. మంగళవారం యాదగిరిగుట్టలోని వైకుంఠ ద్వారం వద్ద ఆలయ ఉద్యోగులు నిరసన ప్రదర్శనలు చేశారు. విధి నిర్వహణలో భాగంగా భూముల పరిరక్షణకు వెళ్లిన భద్రాచలం ఆలయ ఈవో రమాదేవి, అర్చకులు, ఆలయ సిబ్బందిపై దాడికి పాల్పడిన దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇట్టి విషయంలో ప్రభుత్వం వెంటనే స్పందించి దుండగులపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఆలయాల భూముల పరిరక్షణ కోసం ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధాన దేవాలయాల జేఏసీ చైర్మన్ గజవెల్లి రమేష్ బాబు, ఆలయ ఏఈవోలు, సూపరింటెండెంట్లు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, అర్చకులు, ఇతర మినిస్టీరియల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రెవెన్యూ సదస్సు దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి





**- యాదాద్రి జిల్లా కలెక్టర్ హనుమంతరావు**

యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: యాదాద్రి జిల్లాలోని రెవెన్యూ గ్రామాల్లో ఇటీవల నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో ప్రజల నుండి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి భూసమస్యలను వెంటనే పరిష్కరించాలని యాదాద్రి జిల్లా కలెక్టర్ హనుమంతరావు ఆదేశించారు. మంగళవారం యాదగిరిగుట్ట తహాశీల్దార్ కార్యాలయాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. భూభారతి రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించారు. రెవెన్యూ సదస్సు దరఖాస్తులకు ప్రాధాన్యత ఇచ్చి పెండింగ్ లేకుండా డిస్పోజ్ చేయాలన్నారు. రెవెన్యూ సదస్సు దరఖాస్తులు, తహాశీల్దార్ లాగిన్ లో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించడానికి అధికారులు కృషి చేయాలని సూచించారు. రెవెన్యూ పరంగా ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకుంటూ భూసమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు.

**'ఇందిరమ్మ' ఇండ్ల నిర్మాణాలు స్పీడప్ చేయాలి**

ఇందిరమ్మ ఇండ్లపై ఎప్పటికప్పుడు రివ్యూ చేస్తూ నిర్మాణాలు స్పీడప్ అయ్యేలా చొరవ తీసుకోవాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ హనుమంతరావు ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల పురోగతిపై యాదగిరిగుట్ట మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో నవీన్ కుమార్ తో కలిసి సమీక్షించారు. ఇందిరమ్మ ఇండ్లు సాంక్షన్ అయి నిర్మాణాలు స్టార్ట్ మొదలుపెట్టని లబ్ధిదారులతో ప్రత్యక్షంగా మాట్లాడాలని, ఆర్థికపరమైన ఇబ్బందులు ఉంటే మహిళా సంఘాల ద్వారా లోన్లు ఇప్పించి ఇండ్ల పనులు మొదలయ్యేలా చర్యలు చేపట్టాలని సూచించారు. పురోగతిలో ఉన్న ఇండ్ల నిర్మాణాలు త్వరగా కంప్లీట్ అయ్యేలా కృషి చేయాలన్నారు. బేస్మెంట్ లెవెల్, పిల్లర్ లెవెల్, స్లాబ్ లెవెల్ వరకు ఇంటి నిర్మాణాలు పూర్తి చేసుకున్న లబ్ధిదారులకు ప్రతి సోమవారం బ్యాంక్ అకౌంట్ లో డబ్బులు డిపాజిట్ చేస్తున్నామని పేర్కొన్నారు. ఇంటి నిర్మాణాలు త్వరితగతిన ఫినిష్ చేసుకుని గృహప్రవేశాలు చేపట్టేలా చూడాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహాశీల్దార్ గణేష్ నాయక్, ఎంపీడీవో నవీన్ కుమార్, ఆర్ఐ శ్రీకాంత్, రెవెన్యూ సిబ్బంది, మండల పరిషత్ కార్యాలయ ఆఫీసర్లు ఉన్నారు.

# కుటుంబం మొత్తం ఒకే పీఎస్ లో ఓటేసేలా ఓటర్ జాబితా రూపొందించాలి

**యాదాద్రి జిల్లా అడిషనల్ కలెక్టర్ వీరారెడ్డి**



యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: కుటుంబంలోని సభ్యులంతా ఒకే పోలింగ్ స్టేషన్ లో ఓటు హక్కు వినియోగించుకునే విధంగా జాగ్రత్తలు తీసుకుంటూ ఓటర్ జాబితాను రూపొందించాలని బూత్ లెవల్ అధికారులకు(బీఎల్ఓలు) యాదాద్రి జిల్లా అడిషనల్ కలెక్టర్ వీరారెడ్డి ఆదేశించారు. గ్రామాల్లో బీఎల్ఓలు క్షేత్రస్థాయిలో ప్రతి ఇంటికి వెళ్ళి ఓటర్ల వివరాలను పరిశీలించి, మార్పులు, చేర్పుల విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు.. మంగళవారం యాదగిరిగుట్ట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బీఎల్ఓలకు నిర్వహించిన జాతీయ శిక్షణా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫారం-6, 7, 8 నిర్వహణ పట్ల బీఎల్ఓలు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ఓటర్ జాబితాలో పేర్లలో తప్పులుంటే సరిచేసి, అవసరమైన చోట పాత ఫొటోలు తొలగించి కొత్త ఫొటోలు అప్లోడ్ చేయాలన్నారు. ఫారం-6 ద్వారా కొత్త ఓటర్ల పేర్లను నమోదు చేసి, కుటుంబ సభ్యులంతా ఒకే పోలింగ్ కేంద్రంలో ఓటు నమోదు అయ్యేలా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. చనిపోయిన ఓటర్ల పేర్లను ఫారం-7 ద్వారా జాబితా నుండి తొలగించి, కుటుంబ సభ్యుల నుండి డెత్ సర్టిఫికేట్ ను తప్పక తీసుకోవాలని తెలిపారు. ఫారం-8 ద్వారా షిఫ్టింగ్, పేర్ల మార్పిడిలు చేయాలని బీఎల్ఓలకు సూచించారు.

**మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన అడిషనల్ కలెక్టర్**

జెడ్పీహెచ్ఎస్ లో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనాన్ని అడిషనల్ కలెక్టర్ వీరారెడ్డి పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందిస్తున్నారా.? లేదా.? అని వార్డెన్ ను అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం తాజా కూరగాయలతో విద్యార్థులకు క్వాలిటీ ఫుడ్ అందించాలని ఆదేశించారు. అనంతరం ఫుడ్ ఎలా ఉందని భోజనం చేస్తున్న విద్యార్థులను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. స్టూడెంట్స్ నాణ్యమైన ఆహారం తీసుకుంటూ జ్ఞాపకశక్తిని పెంచుకుని మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహాశీల్దార్ గణేష్ నాయక్, ఎంఈవో శరత్ యామినీ, ట్రైనర్లు హరినాథ్ రెడ్డి, వెంకటేష్, రాజు, దినేజ్, ఉదయ్ కుమార్, ఉమాశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# వైఎస్ఆర్ అమలు చేసిన పథకాలు ప్రజల్లో చెరగని ముద్ర వేశాయి

**యాదగిరిగుట్ట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మంగ సత్యనారాయణ**

**యాదగిరిగుట్టలో వైఎస్ఆర్ జయంతి కార్యక్రమం**



యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రవేశపెట్టిన 108 అంబులెన్స్, ఫీజు రీయంబర్స్ మెంట్, ఆరోగ్యశ్రీ పథకాలు ప్రజల్లో ఆయనకు చెరగని ముద్ర వేశాయని యాదగిరిగుట్ట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మంగ సత్యనారాయణ పేర్కొన్నారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి అమలు చేసిన పథకాలను దేశంలోని దాదాపుగా అన్ని రాష్ట్రాలు కాపీ కొట్టి అమలు చేస్తున్నా యని తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం, దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్భం గా మంగళవారం యాదాద్రి జిల్లా యాదగిరిగుట్టలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో.. కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు మంగ సత్యనారాయణ ఆధ్వర్యంలో నాయ కులు వైఎస్ఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా మండలాధ్యక్షుడు మంగ సత్యనారాయణ మాట్లాడుతూ.. వైఎస్ఆర్ చనిపోయి 15 ఏళ్లు గడుస్తున్నా ఆయన గుర్తులు ప్రజల్లో చిరస్మర ణీయంగా ఉన్నాయన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమం లో వైఎస్ఆర్ దేశానికే ఆదర్శంగా నిలిపారని కొనియా డారు. వైఎస్ఆర్ శ్రమ, సమయస్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని యువత రాజకీయాల్లోకి వచ్చి రాణించాలని సూచించారు. మాజీ కౌన్సిలర్ మల్లేష్ యాదవ్, పట్టణ అధ్యక్షుడు బిక్షపతి, మండల నాయకులు కళ్లెం జహంగీర్ గౌడ్, శ్రీనివాస్, ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షుడు జీవన్ రెడ్డి, పట్టణ ఉపాధ్యక్షుడు భాస్కర్, పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ నరసింహ గౌడ్, నాయకులు బలరాం, ముత్యాలు, వడ్డెర సంఘం అధ్యక్షుడు బాలయ్య తదితరులు ఉన్నారు.

